# సాహిత్య విమర్శలో నూతన పదకల్పనలు

డా. జి. అరుణకుమారి
17.09.2009

పాండిత్యం లేనివాడు కవి అవుతాడని, కవిత్వం రానివాడు విమర్శకుడౌతాడనేది ఒక ఛలోక్తి. కప్పి చెపితే కవిత్వం విప్పి చెపితే విమర్శ అని అన్నారు సినారె. కవి విమర్శకులు గర్భ శత్రువులు అనేది ఒకనాటి స్థితి. దానికి నిదర్శనం దువ్వూరి రామిరెడ్డి రాసిన 'విమర్శకుడు' గేయం. ఈ గేయంలో 'పండితోత్తములకుం, గవివర్యులకుం బరస్పరంబును నెవియో విరోధములు పుట్టిన యప్డె విమర్శనంబు పుట్టును' అని విమర్శ రాగద్వేషాలకు తావిచ్చిందనే విషయాన్ని పేర్కొన్నారు.

ఒక కావ్యంలో "తప్పొప్పులంగని, రసముల్ గణించి, ఎసకమ్మగు భావములం దలంచి శోభను గమనించి, శిల్పకళ పద్ధతి గాంచి, ఔచితిం కనుంగొని, కవి చిత్త మరసి, క్రోధము బాసి, విశేష శాంత భావ నియతితో విమర్శనం వ్రాసిన నయ్యది మార్గ సూచియై తనరు" అని లక్షణాన్ని చెప్పి ఆనాటి విమర్శకుల ధోరణిని సమాజ స్థితిని వర్ణించాడు దువ్వూరి.

'కుమారిక తా కవితాలతాంగులే
యనలము జొచ్చిరో, రసమయంబుగ నేటికి గైతసెప్పుజా
లిన కవులెందఱో తొలిమలిం గుఱివెట్టు విమర్శతాకునన్'
'దినదినము కృశించి యతిదీనత నీ కవితోద్యమంబె మా
నిన సుఖమంచు నెంచిరొా, వినీతి నికం గని మారకాస్త్ర లీ
లను నుపసంహరింపుమి కళాపరిపూర్తికి దారిచూపుమీ'

నవ్య కవులు, కవిత్వం చెప్పగలవారు విమర్శకుల తాకిడికి కవితోద్యమాన్ని వదిలారో, శిక్షల నుపసంహరింపమని కళాపరిపుష్టికి మార్గం చూపించమని వేడుకున్నారు.

కావ్య వస్తు తత్త్వ నిరూపణమే విమర్శ. కావ్యం వస్తువు అయినపుడు విమర్శ ఆ వస్తు తత్త్వాన్ని నిరూపిస్తుంది. కావ్యం లేనిది విమర్శ లేదు. విమర్శకు స్వయం ప్రతిపత్తి లేదు. విమర్శ కావ్య రచనా సమయంలో అంతర్లీనంగా ఉంటుందంటాడు గురజాడ అప్పారావు. కాని దానిని విమర్శగా వ్యవహరించడు.

"అభిరుచి, గుణదోష నిశ్చయార్థం ఉన్న రచయిత ఒక కావ్యాన్ని రచిస్తున్నపుడు అతని సృజన, విమర్శనా శక్తులు రెండూ కుడి ఎడమలుగా ఆ కావ్య సృష్టిని కొనసాగిస్తాయి". అని అంటాడు గురజాడ (మాట మంతీ అవీ యివీ పుట 155) ఇదొక ధోరణి అయితే మరో వాదాన్ని కూడ గమనించవచ్చు. కావ్యానికి నిరూపకంగా ప్రకాశంగా స్వయం ప్రతిపత్తి కలిగి ఉండడం వలన దీనిని విమర్శగా గుర్తిస్తున్నారు. కవిత్వం విమర్శ పరిపోష కాలనేది రెండవ ధోరణి. విమర్శ లేకుండా కావ్యానికి ప్రకాశం లేదు. గ్రీకు సాహిత్య విమర్శ మాత్రం గ్రీకు సాహిత్యంతో బాటే ఆవిర్భవించింది.

రచనలతో విస్తృత పరిచయం, అవగాహన, గుణదోషాలను వివేచించే శక్తి, దార్శనిక దృక్పథం సమకాలీన దృక్పథం, ప్రాపంచికానుభవం, నేర్పు, ఓర్పు, సామర్థ్యం, ఋజుత్వా, సహృదయత, బహుముఖ ప్రజ్ఞ, అంతర్దృష్టితో బాటు రచనా శైలి వంటి లక్షణాలు విమర్శకునికి ఉండాలి.

అస్వతంత్ర విమర్శను ఆలంకారిక విమర్శ, సాంప్రదాయిక విమర్శ, ప్రాచీన విమర్శ, నిబిడ విమర్శ అని వ్యవహరిస్తున్నారు. ఆంగ్లంలో దీనిని Deductive అని Judicial Criticism అని అంటున్నారు. ఇది సిద్ధాంతాలకు విధేయమైనది నిబద్ధమైనది.

స్వతంత్ర విమర్శలో నూతనాంశాలు శాస్త్రాలు ప్రతి పాదితమై వ్యాప్తిలోకి వస్తున్నాయి. ఈ నూతనాంశాలు సాహిత్యంలో చోటుచేసుకుంటున్నాయి. ఈ అంశాల ననుసరించి విమర్శలో కూడా అనేక నూతన విమర్శన పద్ధతులు వెలువడుతున్నాయి. ప్రయోగాత్మక విప్లవాత్మక విమర్శన విధానాలు రూపొందే పద్ధతిని స్వతంత్ర విమర్శ అని అంటున్నారు. దీనినే ఆంగ్లంలో Inductive Criticism అని వ్యవహరిస్తున్నారు. వివరణాత్మక, విశ్లేషణాత్మక, వ్యాఖ్యానాత్మక, అనువర్తిత, ప్రయోగాత్మక పరిశోధనలు ఈ కోవకు చెందినవే.

సాహిత్యంలో భావాలు, భావనలు, సిద్ధాంతాలు, ధోరణులు, చారిత్రక ప్రాముఖ్యత కలిగిన సంస్థలు, మానిఫెస్టోలు, సాహిత్య ఉద్యమాలు, వివాదాలు, పరిణామాలు, రచనలు, సాహిత్య విలువలు.... వంటివి ఎన్నో పైన పేర్కొన్న పరిధిలో ఇమిడి పోతుంటాయి. ఒక భావ జాలాన్ని ఒకరి కంటే ఎక్కువ మంది ప్రారంభించవచ్చు, ప్రతిపాదించిన దానిని ఒక వ్యక్తి పలురకాలుగా వ్యాఖ్యానించవచ్చు, దానినే పలువురు పలురకాలుగా నిర్వచించవచ్చు అనేది మౌలికమైన భావన. (ఎస్.ఎస్.నళిని, సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ)

ఒక విషయంపై కలిగే జిజ్ఞాస శాస్త్ర పరిశోధనకు మూలం. తెలిసిన దానినుండి తెలియని దానికై కొనసాగే అన్వేషణే పరిశోధన. ఈ మార్గాన్వేషణలోనే సిద్ధాంతాలు పరిణామాలు, విలువలు..... మొదలైన అంశాలు ఎదురవుతాయి. భవిష్యత్తు, భవిష్యవాదం, భవిష్యశాస్త్రం అనే అంశాలపై కలిగిన ఆసక్తి నూతన పద కల్పనకు మూలమయ్యింది. ఈ విషయాంశాలపైన ప్రాచ్య పాశ్చాత్యుల దృక్పథాలు భిన్నంగా కనిపిస్తాయి. సమకాలీన సమాజానికి శాస్త్రానికి ఉన్న సంబంధం, ఆర్థిక, సామాజిక, రాజకీయ సాంస్కృతిక రంగాలలో అది నెరపిన ప్రభావం..... ఈ రంగంలో ఏర్పడిన నూతన భావజాలం..... దానికి ఏర్పరచుకోవలసిన పదజాల అవశ్యకత ఎంతైనా ఉంది. వర్తమాన మూలరేఖలను భవిష్యత్తులోనికి తీసుకు వెళ్ళేవే భవిష్య పరిశోధనలు. శాస్త్రీయ పరిశోధనలు చేసేవారందరూ ప్రగతి శాస్త్రాన్ని, మనిషి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రచనలు చేస్తున్నారు. మన అధ్యయనాలన్నీ మానవ ప్రకృతి, పరిణామక్రమం, భవిష్యత్తును ఆశ్రయించుకొని ఉన్నాయి. భవిష్యవాదం, భవిష్యశాస్త్రానికి సంబంధించి ఐదు వందల నూతన పదకల్పన చేసాను. ఇక్కడ కొన్ని పదాలను వివరణలతో ఉదాహరిస్తున్నాను.

1. భవిష్య శాస్త్రం : (Futurology)

శాస్త్రీయ దృక్పథంతో మూల్యాంకనాలతో భవిష్యత్తును సూచించే విజ్ఞాన శాస్త్రమే భవిష్యశాస్త్రం. జర్మనీ చారిత్రకుడు ఆసిఫ్ కాప్లస్టీమ్ 1949లో ఈ పదాన్ని ప్రయోగించాడు. ఈ పదాన్ని గురించి ఆల్విన్ టాఫ్లర్ ఫ్యూచర్ షాక్ అనే గ్రంథంలో చర్చించాడు.

2. సంభవనీయ భవిష్యత్తు : (Possible Future)

వెంటనే సంభవించేది. ప్రయత్నం, కృషి, ఏకాగ్రత వలన జరుగుతుంది.

3. సంభావ్య భవిష్యత్తు : (Probable Future)

భవిష్యత్తులో జరగవచ్చు, జరగక పోవచ్చు.

4. అధిగణన భవిష్యత్తు : (Preferable Future)

ఉన్న మార్గాలలో ఒక దానిని ఎన్నుకోవటం. ఈ పద్ధతిలో వర్తమానం భవిష్యత్తుకు దారి తీస్తుంది. ఎన్నికకు స్వేచ్ఛ, వరణం అవసరం.

5. భవిష్య వాదులు : (Futurists)

ప్రపంచ సమైక్యత కోసం భవిష్య సంఘటనలను గురించి ఆలోచించి రాబోయే ఆపదలకు పరిష్కార ప్రత్యామ్నాయ మార్గాలను సూచించేవారు.

6. భవిష్య రేఖాచిత్రం : (Future Profile)

మానవుడు, అతని ఆలోచనలు, పరిస్థితులను సంక్షిప్తంగా వర్ణించే రేఖాచిత్రం. భవిష్య జీవిత చరిత్రను తెలియజేసే రేఖాచిత్రం... భవిష్య మానవులు, సంఘటనలు, ప్రజాస్వామ్యం, పరిణామం, మానవుని గమ్యం మొదలైన వాటిని గురించి సూచనా ప్రాయంగా సంక్షిప్తంగా వర్ణించే రేఖాచిత్రం.

7. భౌగోళిక చలనం : (Geographical Mobility)

సౌకర్యార్థం జీవి ఒక స్థలం నుండి మరొక స్థలానికి వెళ్ళటాన్ని భౌగోళిక చలనమని అనవచ్చు. భూమి, దానిపై ఉన్న మానవులు, వారికి సంబంధించిన శాస్త్రమే భూగోళశాస్త్రం. ఇది ఆర్థిక, ప్రాకృతిక వనరులపై సాధించిన సంస్కృతిని సూచిస్తుంది. గ్రామాల్లోనే గ్రామీణ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు స్థాపించాలని సూచిస్తున్నారు భవిష్యవాదులు. భౌగోళిక ప్రాంతాలన్నీ సమానంగా వినియోగింపబడి అభివృద్ధి చెందాలి. గ్రామాల నుండి పట్టణాలకు తరలివచ్చేవారి సంఖ్య తగ్గుతుంది. జనాభా అధికంగా ఉండటం వల్ల కాలుష్య నివారణకు ఇది మార్గమని భావిస్తున్నారు.

8. ప్రపంచీకరణం : (Globalisation)

గ్రామ ప్రజలను విస్తృత భావాలున్నవారిగా తీర్చిదిద్దే ప్రక్రియ. ఇది మానసిక, మానవతా విలువల అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.

9. విశ్వవాదం : (Globalism)

ఇదొక ధోరణి. మానవుల ఆలోచనలలో పరిపూర్ణత్వాన్ని కలిగించాలి. ప్రపంచ క్రమం, ప్రపంచ భవిష్యత్తు ప్రపంచ ప్రభుత్వం ఈ సిద్ధాంతానికి చెందినవి. మానవీకరణం విశ్వీకరణకు ఒక సాధనం.

10. విశ్వగ్రామం : (Global Village)

విశాల దృక్పథాలతో ప్రపంచ వ్యాప్తి పొందిన ధోరణులున్న గ్రామం విశ్వగ్రామం. గ్రామ ప్రజలను విస్తృత భావాలున్న వారిగా మారుస్తుంది. సూది రంధ్రం నుండి సమస్త ప్రపంచాన్ని దర్శించగలిగినట్లుగా చిన్న సమస్యను కూడా ప్రపంచ సమస్యల దృష్టితో చూడవచ్చు. ప్రతి గ్రామాన్ని సంపూర్ణంగా మార్చాలని ప్రతిదేశం ఆశిస్తుంది.

11. సామూహిక చికిత్స : (Group Therapy)

పరామనో విజ్ఞాన శాస్త్రంలో వ్యక్తిగత చికిత్స, సామూహిక చికిత్స అని రెండు రకాల చికిత్సలున్నాయి.

ఒకే విధమైన వ్యాధితో బాధపడేవారికి చేసేది సామూహిక చికిత్స.

12. ఉభయచర దాడి : (Amphibious Warfare)

క్రీస్తు పూర్వం 415 లో ఏథేన్సు సిసీలిపై దాడి చేసినపుడు భూమిపై నుండి, నీటిపై నుండి దాడులు కొనసాగించారు. ఈ రకం యుద్ధతంత్రాన్ని ఉభయచర దాడి, ఉభయచర యుద్ధతంత్రం అని అన్నారు.

13. క్షురక మీమాంస : (Barbar Paradox)

ప్రొటెస్టంటులు కాథలికులు భిన్న క్షరకర్మను చేసుకొనే రోజుల్లో ఏ తెగకు చెందినవారో తెలియక క్షురకుడు సందిగ్ధావస్థలో పడిన తీరును నేటి మానవుల స్థితితో పోల్చి చూస్తున్నారు.

14. బ్రౌన్ గమనం : (Bronian Movement)

1827లో రాబర్ట్ బ్రౌన్ వృక్ష శాస్త్రవేత్త ద్రవంలో మునిగిన చిన్న కణాల మధ్య జరిగే గమనం క్రమం లేకుండా ఉండటాన్ని గమనించాడు. క్రమం లేని ఈ చలనానికి బ్రౌన్ గమనం అనే పేరు స్థిరపడింది. భవిష్యవాదులు ఈ కణాల మాదిరిగానే మానవులు లక్ష్యం లేనివారై తిరుగుతున్నారని భావిస్తున్నారు.

15. గృహ అధ్యయనం : (Home Study)

పాశ్చాత్య దేశాలలో విరివిగా వాడే పదం. భారతదేశంలోను గృహ అధ్యయన పద్ధతిని పరిచయం చేసారు. దూరవిద్య ఈ కోవకు చెందినదే. జపాన్, కాలిఫోర్నియా వంటి దేశాలు గృహ అధ్యయన పద్ధతులను ప్రోత్సహిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం కాలుష్య నివారణమని అంటున్నారు.

ప్రపంచ పురోగమనంలో అనేక నూతనాంశాలు పలురంగాలలో ఇమిడి పోతున్నాయి. మార్పును ఆహ్వానిస్తూ ఆయా రంగాలలో భాగంగా ఇమిడిపోతూ ముందుకు సాగిపోతున్న క్రమంలో అనేక నూతన పదకల్పనలు చోటు చేసుకున్నాయి. ఈ పదాలను నిఘంటువులలో చేర్చాల్సిన ఆవశ్యకత ఉంది.